# పాపం ఆంథోని

ఆంథోని వంటరివాడు. అతని చిన్నప్పుడే, తండ్రి పచ్చకామెర్ల వ్యాధితో చనిపోయాడు. అప్పటి నుంచీ తల్లే అతనిని కష్టపడి పెంచింది. ఆమె ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. ఎనిమిదో క్లాసు తర్వాత అతను బడికిపోవడం మానేసి, ఒక లారీ డ్రైవర్ దగ్గర క్లీనర్‌గా పనికి కుదిరాడు. లారీ డ్రైవర్‌కి ఆ చిన్న క్లీనర్ బాగా నచ్చాడు. ఏం చెబితే అది చేస్తాడు. లారీని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుతాడు. అతని పెదవులపై సదా చిరునవ్వు లాస్యం చేస్తూ ఉంటుంది. అతనికి లభిస్తున్న తుచ్ఛమైన దినసరివేతనం, అతను పస్తులుండకుండా సరిపోతుంది. కానీ, దానితోపాటు, తల్లికి కావలసిన మందులు కొనడానికి మాత్రం సరిపోయేది కాదు. క్లీనర్ పనితోపాటు సరుకులు ఎత్తడం, దించడం లాంటి బరువైన పనులు కూడా చేసేవాడు. ఆంథోనికి పదిహేడేళ్ళు వచ్చేసరికి తల్లి కూడా కన్ను మూసింది. ఆ తరువాత అతను తనని ఎంతగానో ఇష్టపడే డ్రైవర్ ఇంటిలోనే ఉండిపోయాడు. రోడ్డు పక్కన హోటళ్ళలోనే భోజనం చేసేవాడు. ఆ డ్రైవర్ అతనికి మెల్లగా డ్రైవింగ్ కూడా నేర్పించాడు. పందొమ్మిదో ఏట అతనికి డ్రైవింగ్ లైసెన్స్ వచ్చింది. అయినా, మరి కొంతకాలం క్లీనర్‌గానే కొనసాగాడు.

తల్లి చనిపోవడంతోనే, అతని చిరునవ్వు కూడా మాయమైపోయింది. ఇతరులతో మాటలు కూడా చాలా తగ్గించాడు. ఎవరయినా, ఏదయినా అడిగితే, తప్ప అనవసరంగా మాట్లాడడు. అతని మనసుని ఎల్లప్పుడూ నైరాశ్యం, వేదన తినేస్తున్నాయని తెలుసుకున్న ఆ డ్రైవరన్న అతనికి తాగుడు అలవాటు చేశాడు. కొద్దిగా తాగిన తరువాత, ఆంథోనీ, కొంతవరకూ మాట్లాడటం, నవ్వడం చూసి, ఆ డ్రైవరన్న సంతోషించాడు.

ఇరవై ఒక్క సంవత్సరాలకి ఆంథోని ప్రైవేటుగా మెట్రిక్యులేషన్ పరీక్ష రాసి పాసయ్యేడు. అది కూడా ఫస్ట్‌క్లాస్‌లో. దానితో డ్రైవర్ల, క్లీనర్ల సంఘంలో అతనికొక గౌరవ స్థానం లభించింది. ఆ డ్రైవరన్న లారీయజమాని ఇంకొక కొత్తలారీ కొని దాన్ని ఆంథోనీకి అప్పజెప్పాడు. ఎంతో నమ్మకస్తుడైన ఆంథోనీ లారీయజమానికి బాగా నచ్చాడు. ఆంథోని అంత ఎక్కువగా తాగేవాడు కాదు గాని, బాగా భోజనం చేసేవాడు. ఎంతో కష్టపడిపనిచేసే ఆంథోనీ కండలు దృఢంగా ఉండటంతో పాటు నునుపుగా ఉండేవి. ఎత్తు అయిదడుగుల పదంగుళాలు. ఒక మోస్తరు నల్లటి ఛాయ... కాకి నలుపు కాదు.... ఒక రకం లేతనలుపు. అతని దృఢకాయానికి ఆ రంగే సరిపోతుంది. ఇంకాస్త తెల్లగా ఉంటే, పాలిపోయినట్లు, బలం లేనట్లు కనపడతాడేమో! రోజ్‌వుడ్ చెక్కకి, పనస చెక్కరంగు వేస్తే ఏం బాగుంటుంది! అతని గిరజాల జుట్టు ఎలా

ఉన్నా కూడా అందంగా ఉండేది. దాన్ని దువ్వి చక్కగా ఉంచటమే కష్టం. ఒకవేళ అలా ఉంచినా, అతని పని లారీ నడపడమే కదా! లారీ క్యాబిన్ ఎయిర్‌కండిషన్డ్ కాదు కదా! అందుకే, లారీ నడిపేటప్పుడు, పదినిముషాల్లోపల గాలితో సల్లాపం చేస్తున్న దాదాపు రెండున్నరా, మూడంగుళాల పొడవున్న అతని జుట్టు ఆ తలపై నున్నని ఒక ఉన్ని టోపీ పెట్టినట్టు కనిపిస్తుంది. అతని ఉంగరాల జుట్టు గాలితో ఎగిరేటప్పుడు, అది పాముల సమూహరతి నర్తనమేనా (ఆర్గీలాంటి) అనీ, సరీసృపాలూ, వాటి ఆరోహణ, అవరోహణ చలనాలతో పాటు జరిగే కలయికల గురించి అవగాహన ఉన్నవాళ్ళకు సందేహం కలుగుతుంది. హిట్లర్‌కున్నట్లు డెబ్భై అయిదు శాతం ఎలుకలు తినేసిన మీసం కాదతనిది. జార్జ్‌బుష్ పేరుని స్ఫురింపజేస్తూ, అతనికి లేనటువంటి గట్టి మీసాలు, మా కథానాయకుడి పురుషత్వాన్ని ప్రకటించే లౌడ్‌స్పీకర్‌లా ఉండేవి. లారీ నడిపేటప్పుడు, చొక్కా వేసుకోవడం అతని కిష్టం ఉండేది కాదు. చేతుల్లేని బనీను మాత్రం వేసుకుని, అతను చక్రం తిప్పేటప్పుడు, కండరాల కదలికలు చూస్తే, యువ యౌవన దేవతలకు కూడా ఈర్ష్య కలుగుతుందేమో! అతన్ని కౌగిలించుకోవాలనే కోరిక వల్ల వీనస్‌కు చేతులు మొలుచుకొస్తాయేమో!

ఇలాంటి ఆరోగ్యంతో కూడిన ఒక దృఢగాత్రానికి యజమానియైనా కూడా ఆంథోనీకి ఆత్మవిశ్వాసమన్నది లేనే లేదు. జీవితంపైన అతనికెటువంటి ఆశా ఉండేది కాదు. తనకంటూ ఎవరూ లేని ఈ ప్రపంచంలో ఏకాకిగా బతకడంలో ఎటువంటి అర్థంలేదని అతనికి అనిపించేది. తల్లిదండ్రులు పోయిన తర్వాత, కొంతకాలం, ఒక డ్రైవరన్న సహతాపం అనే రొట్టెముక్కలతోనే కదా అతను బతికాడు. శైశవంలో, జీవితమాధుర్యం ఆస్వాదించడానికి అవకాశం లభించకుండా, తిక్తతి-తిరస్కృతిల ముళ్ళకిరీటం ధరించి, జీవిత భారమనే వెన్నముకని విరగొట్టే శిలువ మోస్తూ దాదాపు రెండు దశాబ్దాలు అతను పాకుతూ ముందుకు వచ్చాడు కదా! పట్టుకోవడానికి ఒక చక్రం ఇప్పుడు లభించిందని చెప్పి, అతని జీవితచక్రానికి సురక్షితత్వం ఏమయినా ఏర్పడిందా? ఎప్పుడయినా, ఏదయినా కారణాల వల్ల అతని ఆరోగ్యానికి కీడు సంభవిస్తే,..... ఒకచేతికి కానీ, ఒక కాలుకు కానీ బలహీనత కలిగితే, అతనికిప్పుడున్న జీవనోపాధి కూడా పోతుంది. కేవలం, కడుపు నింపుకోవడం కోసమే, ఎందుకు బతకాలని అతనికి అనిపించేది.

తల్లి అంటే అతనికి ఎంతో ప్రేమ ఉండేది. ఎన్నో కష్టాలు భరించి, ఆమె తనని పోషించిందని, తను ఎంత కష్టపడి తల్లి జీవితాన్ని పొడిగించడానికి ప్రయత్నం చేశాడోనని ఆలోచించేటప్పుడు, ఎందుకిటువంటి జీవితాన్ని భగవంతుడు తమకు ప్రసాదించాడని బాధపడేవాడు. అయినా కానీ, అతను భగవంతుడెప్పుడూ నిందించలేదు.

పెళ్ళి చేసుకోవాలనే కోరిక అతనికెప్పుడూ కలుగలేదు. చాలా మటుకు ఆడవాళ్ళల్లో అతనికి తల్లే కనిపించేది. సాధారణంగా ఆడవారిని అతను కన్నెత్తి చూసేవాడు కాదు... వాళ్ళు కళ్ళకి కాటుకపెట్టుకుని, నుదుటన బొట్టు దిద్దుకుని, అందంగా నిలబడినా కూడా, ఈ యవ్వనదశలో... యువత్వం తొణికిసలాడుతున్న దశలో ఆ శరీరానికి, ఆడవారినుంచి దూరంగా ఉండటం సాధ్యమేనా! కానీ, యౌవనం తొణికిసలాడేది అతని శరీరంపై మాత్రమే కదా! అతని మనస్సెప్పుడూ కూడా గిడసబారిపోయినట్టే ఉండేది. ఎలాంటి విరోధభావం! అతని శరీరం – మనస్సుల మధ్య ఒక లూజ్ కనెక్షన్ లేదా లూజ్‌కాంటాక్ట్.

ఎవరయినా, అతని ముందు పెళ్ళి ప్రస్తావనతెస్తే, అతని మనస్సు వెంటనే తల్లివైపు, గతానికి పయనిస్తుంది. వైధవ్యం ఆమెని ఎన్నెన్ని కష్టాల నిప్పులపై నడిపించింది. ఒక్కగానొక్క కొడుకుని పెంచడానికి ఆమె చేసిన త్యాగాలు తక్కువేనా? చివరికి ఆమె మిగిలింది, తీరని రోగాలూ, ఆగని కన్నీరు. ఆమె శ్వాస ఆగిపోయినప్పుడే, వాటికి ఉపశమనం కలిగింది.

తను కూడా పెళ్ళి చేసుకుని, ఒకరో, ఇద్దరో పిల్లల్ని కని, కొంతకాలం తర్వాత ఆ స్త్రీనివిధవగా చేసినా... తనే రోగగ్రస్తుడయినా..., ఏదో ప్రమాదవశాత్తూ అంగవిహీనుడైనా తరువాత, ఆమె, ఆమె పిల్లల పరిస్థితి ఏమవుతుంది? అని ఆలోచించి, అతను భయంతో కుంగిపోయేవాడు. అందుకే, తనకొక ఇల్లాలు గానీ, పిల్లలు గానీ ఎప్పుడూ అక్కర్లేదనే నిర్ణయానికి అతను వచ్చాడు. ఆ జన బాహుళ్యానికి, దుఃఖ బాహుళతకీ తాత్కాలిక విముక్తి కొరకు, భవిష్యత్తు పట్ల ఉత్కంఠ నుండి కాస్సేపు విరామం దొరకడానికి అతను రాత్రుళ్ళు మదిరాసేవనం చేసేవాడు. కానీ, తాగిన తరువాత అతను ఎప్పుడూ లారీ నడిపేవాడు కాదు. జీవితంలో అతనికి, సుఖమూ, తృప్తీ లభించేది కడుపునిండా మంచి భోజనం చేసేటప్పుడే.

లారీలో సరుకు తీసుకుని అప్పుడప్పుడూ సుదూర ప్రదేశాలకి వెళ్ళాల్సి వచ్చేది. దక్షిణ భారత భాషలన్నీ బాగా నేర్చుకున్న ఆంథోనీ, హిందీలో కూడా మాట్లాడగలగడం వలన అతనికి, ఉత్తర భారతయాత్రలో ఎటువంటి ఇబ్బందులూ ఎదురయ్యేవి కావు. అప్పుడప్పుడూ కలకత్తాకి కూడా వెళ్ళాల్సి రావడం వల్ల, కొన్ని బెంగాలీపదాలు కూడా నేర్చుకున్నాడు. కానీ, "అమీతుమాకోబాలుబాసీ" అనే పెద్దమాటలు ఏవీ అతనికి అవసరం లేదు కదా! దారి తెలుసుకోవడానికీ, అతని రుచికి అనువైన ఆహార పదార్థాలు అడిగి తీసుకోవడానికి కావలసిన పద విజ్ఞానం ఉంటే చాలు కదా! కొన్ని ఊళ్ళల్లో తాగుడు తర్వాత అతని మిత్రులు ఎర్ర వీధులవైపు పదయాత్ర చేసినపుడు, వారితో పాటు వెళ్ళడానికి అతనెప్పుడూ కూడా ఒప్పుకోలేదు. అమ్మాయిని ముట్టుకోవాలనే ఆశకూడా అతనికెప్పుడూ కలుగలేదు.

అప్పుడప్పుడూ, అతను మత్తయి టీ దుకాణం ముందు లారీ ఆపేటప్పుడు అర్థరాత్రి అవుతుంది. ఆకలి వల్ల కడుపు కాలుతున్న సమయమైనా కూడా ముందు దాహ శమనం కోసం రెండు మూడు గ్లాసుల నీళ్ళు తాగి మత్తన్న ఆంథోనీ కోసం ప్రత్యేకంగా దాచి ఉంచే మిలటరీ రమ్ ఒక నాలుగైదు పెగ్గులు తాగుతాడు. దానితో పాటు తినడానికి అన్నమ్మ వదినపెట్టే వేయించిన లేదా కాల్చిన మేక మాంసం కానీ, కోడి మాంసం కానీ, చేప గానీ, అతనెంతో ఇష్టంగా భుజిస్తాడు. అంతటితో ఆగడు, తరువాత పీకలదాకా భోజనం చేస్తాడు. డబ్బు ఖర్చు పెట్టే విషయంలో, అతను వెనుకా ముందూ చూసేవాడు కాదు. ఎవరికోసం అతను డబ్బు దాచిపెట్టాలి? అన్నమ్మ వదిన అతన్ని బలవంతం చేసి మరీ కొసరి కొసరి తినిపించేది. ఆంథోనీ అంటే ఆమెకి చాలా ఇష్టం. రాత్రుళ్ళు అక్కడ భోజనం చేసే రోజుల్లో, అతను అక్కడే నిద్రపోయేవాడు. అతన్ని ఒక తమ్ముడిగానే అన్నమ్మ భావించేది కానీ, నిద్రపోతున్న ఆ యువకుడి దృఢమైన కండలని చూస్తూ నిలబడటంలో ఆమెకి ఒక రకమైన వినోదం కలిగేది. అతను ఒక చెయ్యి తలక్రింద పెట్టి నిద్రపోయేటప్పుడు, సాగరసంగమం సినిమాలో కూచిపూడి నాట్యంచేసే కమలహాసన్ చంకల్లో అమర్చిన వెంట్రుకల్లాంటి పొడుగాటి రోమాలు చూసినపుడు ఆమెలో ఒక విధమైన గిలిగింతపుట్టుకొచ్చేది. అప్పుడు, “ఛీ... ఛీ... ఈ కుర్రవాణ్ణి ఇలా చూడకూడదు, తప్పు.” అనుకుంటూ ఆమె గదికి వెళ్ళిపోయేది. పెళ్ళయిన పన్నెండు సంవత్సరాలకి కూడా పిల్లలు కలగపోవడంతో మత్తయికి కోపం వచ్చినప్పుడల్లా ఆమెని గొడ్రాలని తిట్టేవాడు. ఆ విషయం గురించి ఎవరయినా ఆమెని అడిగితే ఇలాంటి తాగుబోతులకు పిల్లలు పుడతారా? అని ఎదురు జవాబు చెప్పేది. రాత్రుళ్ళు పదీ, పదిన్నర తర్వాత తాగి మత్తెక్కిన మత్తయి మగతగా పడుండేవాడు. అందుకే, టీ షాపులో సెకండ్ షో కార్యక్రమాలన్నీ చూసుకోవాల్సిన బాధ్యత అన్నమ్మకి ఉండేది. ఆమె, దానిని ధైర్యసాహసాలతో సామర్థ్యంతో నిర్వహించేది.

ఆంథోనికి కూడా అన్నమ్మ అంటే ఎంతో ఇష్టం. ఆమెని వదినా అని పిలిచేవాడు. కానీ, ఆమె అతన్ని సార్ అని పిలిచేది. పేరుతో పిలవచ్చు కదా అని అతను అడిగినప్పుడు, “మీరు బాగా చదువుకున్నవారు. మెట్రిక్యులేషన్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. కొన్ని రోజులలో మీరు పెద్ద దొర అవుతారు. మీకు స్వంత లారీ ఉంటుంది. అటువంటి ఒక పెద్దమనిషిని పేరు పెట్టి పిలవడం మర్యాదకాదు. మిమ్మల్ని అతి త్వరలో కామందులుగా చూడాలని నాకు ఆత్రంగా ఉంది.” అని ఆమె చెప్పేది.

ఒక రాత్రి, ఆంథోనీ, కొంచెం ఎక్కువగా తాగాడు. బాగా భోంచేసాడు కూడా. దానికి కారణం కూడా అన్నమ్మే. మత్తయి బాగా తాగి గురకపెడుతూ నిద్రపోతున్నాడు.

అన్నమ్మ, తన గదిలో చాప పరుచుకుని పడుకొని అర్ధనిద్రలో ఉంది. ఆమె దగ్గర ఒక నీడ వచ్చి కూర్చున్నట్టు, ఆమెకి అనిపించింది. చటుక్కున లేవడానికి ప్రయత్నిస్తే, ఆ నీడ తన బాహువులతో ఆమెని గట్టిగా బంధించింది.

“సారూ! సారూ! వద్దు. నావల్ల మీరు నాశనం కాకూడదు.”

ఆంథోనీ ఆమె పెదవులని మూసివేయడం వల్ల, ఆమెకి ఇక మాట్లాడటం సాధ్యం కాలేదు. కాస్త వీలు చిక్కినప్పుడు,

“మీరు తర్వాత బాధపడతారు. నన్ను కాస్త మాట్లాడనివ్వండి. లేకపోతే, మీ బతుకే పాడయిపోతుంది.”

ఇక ఆమెకి మాట్లాడే అవకాశమే దొరకలేదు. ఆంథోనీ లోని మృగం ఆమెని లొంగదీసుకుంది, ఒక యువకుడిలో ఉండే బలమూ, ఆవేశమూ, ఆమె మొదటి సారిగా అనుభవించింది.

మరుసటిరోజు బ్రాహ్మీముహూర్తంలో మరలా అతను ఆమెని సమీపించాడు. ఈసారి ఆమె వైపునుంచి ఎటువంటి ప్రతిఘటన ఎదురుకాలేదు.

ఆంథోనీ తాపం ఉపశమించిన తర్వాత, అన్నమ్మ, “చెయ్యకూడని పని మీరు చేశారు. మిమ్మల్ని ఆపడానికి నేను ఎంతగానో ప్రయత్నించాను. కాని, మీరు నాకు చెప్పడానికి అవకాశం ఇవ్వలేదు. నేను చెప్పబోయే మాట మీరు వినలేదు. ఇంత యువకుడైన మీరు, ఇక ఎంతకాలం బ్రతుకుతారో దేవుడా!” అంటూ విలపించింది.

“వదినా! మీరు చెప్పేదేమిటో నాకు అర్థం కావటంల లేదు.” అయోమయ స్థితిలో ఉన్న ఆంథోనీ అన్నాడు.

“అది చెప్పబోయినప్పుడే కదా, నా నోరు మూసేశారు... సార్! ఏడెనిమిది నెలల్నుంచి నాకు ఆ భయంకర రోగం ఉంది.... ఎయిడ్స్ అంటారు కదా! అదే, ఆ దొంగముండా కొడుకు ఎక్కడ్నుంచో తగిలించుకుని వచ్చి నాకు అంటించాడు. నేను అప్పుడప్పుడు నా రక్తాన్ని అమ్ముకునేదాన్ని. అలా ఒకసారి వెళ్ళినప్పుడు, నా రక్తాన్ని పరీక్షించి డాక్టరు చెప్పాడు. నాకిక ఎక్కువ కాలం బ్రతకాలని లేదు. కానీ, మీరెంతో చిన్నవారు....”

అతను అదిరిపడలేదు. భయంతో వణికిపోతాడని ఆమె అనుకుంది. కానీ, అతను పెద్దగా నవ్వాడు.

"వదినా! నా జీవితం గురించి మీరేమనుకుంటున్నారు? నా బతుకు ఒక రకమైన రోజువారీ కూలీ బ్రతుకే కదా!..... ఈ రోజు గడపగలిగితే చాలు. రేపటి గురించి చింత, నాకెప్పుడూ లేదు. ఎంతో ఎక్కువకాలం బతకడం గురించి ఆలోచించడమే నాకు అసహ్యం. ముసలితనం వచ్చిన తరువాత పనిచేసి బతకడానికి శక్తిలేపోతే, నేను జీవించేదెలా? ఇవ్వాళ బతుకుతున్నట్టు మరికొంత కాలం బతికితే చాలు. సుదీర్ఘమైన జీవితం, నాకు వద్దే వద్దు."

ఏమయినా సరే, నాకిప్పుడు చాలా సంతోషంగా ఉంది. జీవితాన్ని ఎలా ఆస్వాదించాలో నాకిప్పుడే అర్థమైంది. జీవితానికి క్లుప్తత కూడా కలిగింది. ఇక మనిద్దరికీ పండు ముసలితనం రాదు కదా!

ఇక అవకాశం దొరికినప్పుడల్లా మీతో హాయిగా కొంత సమయం గడపడానికి నేనొస్తాను. మనిద్దరికీ రోగం ముదిరినప్పుడూ... మనకు బలహీనత ఎక్కువయినప్పుడూ, ఒకరోజు మనం తాగేదానిలో కొంచెం టిక్ట్వంటీ లాంటిదేదయినా కలుపుదాం. దానితో మనకు ముక్తి.... మోక్షం. కానీ, అంతవరకూ, మనం జీవితాన్ని చక్కగా ఆస్వాదించాలి.

ఈ రోగానికి, కొంత కాలం తర్వాత, ఏదయినా ఒకమందు కనిపెడతారేమో! అలా అయితే, ఇంకా కొంతకాలం మనం బతకవచ్చు. ఆ మందు దొరికినప్పుడు మత్తయికి ఇవ్వవద్దు, సరేనా?" అంటూ మళ్ళీ పెద్దగా నవ్వాడు.

ధీరుడైన ఆ యువకుడి అభిప్రాయంతో ఏకీభవిస్తూ అన్నమ్మ అతన్ని గట్టిగా కౌగలించుకున్నప్పుడు, ఆమె దుఃఖ బాష్పాలు, ఆనందబాష్పాలుగా మారాయి.